కథ

# రంగపూజ

గుండు సుబ్రహ్మణ్య దీక్షితులు

**శ్రీవారు ఆఫీసునించి ఇంకా ఇంటికి రాలేదు. స్కూలు నుంచొచ్చిన పిల్లలిద్దరికీ టిఫిన్లు పెట్టి, వాళ్లని మా పక్క ఫ్లాట్‌లో వాళ్లకి అప్ప జెప్పాను. తొందరగా తిరిగొద్దామని గణపతి ఆలయం వైపు బయల్దేరాను. మా ఉర్వా సెంటర్ నించి గణపతి ఆలయానికి ఉన్న ఫర్లాంగున్నర దూరాన్నీ ఆద రాబాదరాగా మూడు నిముషాల్లో నడిచాను.**

ఆలయంలో ఒక పక్కగా ఉన్న ఆఫీసుగదిలోని గుమాస్తాని నాకు వచ్చీరాని కన్నడంలో "స్వామికి అష్టోత్తరం చేయించదలుచుకున్నాను. టిక్కెట్టిస్తారా?" అనడిగాను. అయిదు రూపాయలిచ్చాను.

ఆ గుమాస్తా నావైపు చూసాడు. టిక్కెట్టిస్తూనే కన్నడంలో "యాకె, ఈవత్తు దేవసేన అవరు విచారవాగె ఇదారె " (ఏమిటీ, ఈరోజు దేవసేనగారు విచారంగా కనిపిస్తున్నారు?)

అక్కణ్ణించి మా సంభాషణ కన్నడం, హిందీ, ఇంగ్లీషుల మిశ్రమంలో సాగింది.

నేనన్నాను, "ఆ ఏముందు లెండి, ఏవేవో సమస్యలు- ఎప్పుడూ ఉండేవే- ఇప్పుడు మరి కొంచెం ఎక్కువ. అంతే తేడా!"

"మీకు సమస్యలేంటండీ! మీ శ్రీవారు ఆయిల్ కంపెనీలో పెద్ద ఇంజనీరు. సిసింద్రీల్లాంటి మీ ఇద్దరు పిల్లలూ రెండు రత్నాలు. గోల్డెన్ ఎంపైర్ లాంటి పోష్ అపార్ట్‌మెంట్‌లో మీ నివాసం. అందర్నీ కలేసుకుని తిరుగుతారు గనక మీకు వ్యతిరేకులుండరు..ఇంకేం సమస్యలండీ!"

"దూరపు కొండలు నునుపు మేస్టారూ! అయినా ఎంత చెట్టుకు అంతగాలి అని కూడా ఉండనే ఉంది గదా!"

ఇంతలో లుంగీ, చొక్కాల్తో ఉన్న ముప్ఫయి అయిదేళ్ల యువకుడొకడు చేతిలో కొబ్బరికాయతో వచ్చి గుమాస్తాను-

"హుణ్ణుకాయ ఒడియువ కల్లు ఎల్లి"(కొబ్బరికాయను కొట్టే రాయి ఎక్కడ) అనడిగాడు.

గుమాస్తా, దేవాలయ ప్రవేశద్వారం పక్కనే లోపలగా అరుగు కింద, ఇనుపబద్దీ పరిచి ఉన్న రాయిని చూపిస్తూ "అల్లి" (అక్కడ) అన్నాడు.

ఆ యువకుడు అటువైపు వెళ్లిపోయాడు.

గుమాస్తా నావైపు చూసి "సమస్య అంత తీవ్రమా! అయితే చెప్పొద్దులెండి" అన్నాడు నవ్వుతూ.

నేనన్నాను, "ఏముందండీ చెప్పటానికి! మా వారికి ఈ మంగుళూరు నుంచి బొంబాయికి బదిలీ అవుతుందని చాలాకాలంగా అనుకొంటున్నాము. దానికి తోడు సర్వీసులో ఉన్న ఇంజనీర్ల సీట్ల కోటాలో మావారికి బొంబాయిలోనే జైన్ ఇన్‌స్టిట్యూట్‌లో ఎమ్.బి.ఏలో సీటొచ్చింది. కానీ తీరా చూస్తే మాటమారి మావారికి గౌహతికి బదిలీ అయ్యేట్లుగా ఉంది. ఇదిలా ఉండగా మా ఫ్లాట్ యజమాని, "చేస్తే వెంటనే ఖాళీ చేసెయ్యండి. లేకపోతే ఇంకో ఏడాది వరకూ ఉంటామని హామీ ఇవ్వండి" అంటున్నాడు. ఇంకా, మా ఇద్దరి పిల్లలి పేరా చెరొక అయిదు వేలూ యూనిట్ ట్రస్టు వారి రాజ్యలక్ష్మి స్కీములో, ఇరవయ్యేళ్లకి లక్షలవుతాయనే ఆశతో, డిపాజిట్ చేసాము. ఇప్పుడు ఆ యూనిట్ ట్రస్టు వాళ్లు, "వడ్డీ రేట్లు పడిపోయాయి కనక, మీ ఆశ దురాశ అవుతోంది. మీ డబ్బు మీకు పంపించేసాం అందుకోండి" అంటూ ఉత్తరం రాసారు. పోనీ ఆ చెక్కులు అయినా వచ్చాయా అంటే వాటి అజాపజా లేదు. హిందూ దేశం అంతా తిరిగి తిరిగి మాకు చేరతాయో లేక హిందూ మహాసముద్రంలో చేరిపోతాయో! మా అపార్ట్‌మెంట్‌లో కింద బేస్‌మెంటులో మా పిల్లలు క్రికెట్ ఆడి తన ఇండికా కారుకు వెనకాల ఉన్న ఎర్రలైట్లు పగలగొట్టేసారని మా పై ఫ్లాటు ఆయన నాతో యుద్ధానికొచ్చారు. నేను మూడు వేలు ఇచ్చుకోవాలిట. మా నాలుగో క్లాసూ, యూ.కె.జీ, క్లాసు పిల్లలిద్దరికీ ఫీజులూ డ్రెస్సుల కింద చెరొక పదిహేను వేలూ వారంలోగా కట్టకపోతే సీట్లుండవుట! ఈ చికాకుల్తో తలనెప్పిగా ఉందని డాక్టరు నేత్రావతి దగ్గరకెళ్తే ఆవిడ, "సుత్తిలా ఉన్నావు. నీకే రోగమూ లేదు. అయినా సరే, ఒక్కసారి బెంగళూరు వెళ్లి నా క్లాస్‌మేట్ డాక్టర్ కణ్ణగి దగ్గర కౌన్సిలింగ్ చేయించుకో" అంది. అంటే, నాకు లేని పిచ్చిని నాకున్నట్టు నన్ను నమ్మమనే గదండీ! నాకొళ్లుమండి ఆవిణ్ణి నాలుగూ దులిపి లేచొచ్చేసాను..మనం చెయ్యగలిగినంతా చేసాక ఇంక ఆపైన చేసేది దేవుడేగదండీ! అందుకే వచ్చాను. పూజకు ఆలస్యమవుతుందా?" ఇట్లా అంటూ నేను వెనక్కు తిరిగి గర్భాలయం వైపు చూసాను.

ముఖమంటపంలోకి అప్పుడే వచ్చిన ఒక సంగీతం ఉపాధ్యాయినీ, ఆవిడ శిష్యురాలూ-లతో మాట్లాడుతూన్న పాతికేళ్ల అర్చకుణ్ణి ఈ గుమాస్తా కేకేసాడు. "ప్రసన్న భట్ అవరె, దేవసేన అవరిగె అష్టోత్తరపూజవన్ను మాడసబేకు (ప్రసన్న భట్ గారూ, దేవసేనగారికి అష్టోత్తరపూజను చేయించాలి)

ప్రసన్నభట్ నా వైపు చూసి, "ఒందు అయిదు నిమిష తాళబేకు (ఒక్క అయిదు నిముషాలు ఆగండమ్మా!)" అన్నాడు.

గుమాస్తా నాతో, "ఈలోపల ప్రదక్షిణం చెయ్యగూడదూ?" అన్నాడు.

ప్రదక్షిణం చెయ్యటానికి నేను కదిలానో లేదో, తన ప్రదక్షిణాలు పూర్తి చేసుకుని నాకు ప్రక్కగా వచ్చాడు, ఇందాకటి తెల్లలుంగీ యువకుడు.

మా ఇద్దరి చూపులూ ఒక్కక్షణం కలిసాయి. అతని గడ్డం మాసిపోయి ఉంది. కళ్లు పీక్కుపోయి ఉన్నాయి. మొహంలో లోతుగా దైన్యం స్పష్టంగా కనిపిస్తోంది. 'ఏదో తీవ్రమైన బాధలోనే ఉన్నాడు' అని నాకనిపించింది. నేను ప్రదక్షిణం కోసం బయల్దేరాను.

ప్రదక్షిణం అనేదాన్ని, ఒక నిండు గర్భిణీ స్త్రీ ఒక నీటి కుండను మోసుకుంటూ నడిచినంత నెమ్మదిగా నడవాలిట! అంతగా కాకపోయినా మొత్తం మీద నెమ్మదిగానే నడిచాన్నేను. నా మూడో ప్రదక్షిణం పూర్తయి బలిపీఠం దగ్గరకొచ్చేసరికి ఇందాకటి గురుశిష్యురాళ్లిద్దరూ ముఖమంటపంలో మూషిక విగ్రహం పక్కన కూర్చొని, "హిమగిరి తనయే, హేమలతే!" కీర్తనను మృదుమధురంగా గానం చేస్తున్నారు. ఆ కీర్తనను వింటూ ఆ పక్కనే బుద్ధిగా కూర్చొని ఉన్నాడు ఆ యువకుడు. తన శిరస్సు మీది అంజలితో అతను తన కళ్లను మాత్రం గర్భగుడిలోని మూల విరాట్టుకు అప్పజెప్పేసాడు. ఆ కళ్లల్లో నీళ్లు సుళ్లు తిరుగుతూండటం నా కంట పడింది.


నాకొచ్చిన స్తోత్రాలన్నీ మననం చేసుకుంటూ నేను ఇంకో ఎనిమిది ప్రదక్షిణాలు పూర్తిచేసాను. ముఖ మంటపంలోకొచ్చాను. అప్పటికి ఆ గురుశిష్యురాళ్లిద్దరూ వెళ్లిపోయారు. ఆ యువకుడు మాత్రం అక్కడే నిశ్చలంగా కూర్చొని ఉన్నాడు.

గర్భ గుళ్లోంచి ప్రసన్నభట్ బయటకొచ్చి నా దగ్గర్నించి పళ్లూ, కర్పూరమూ, పూలూ తీసికెళ్లాడు. మా వారి గోత్రనామాలతో పూజ చేసి పది నిముషాల్లో హారతితో బయటకొచ్చాడు. నేను కళ్లకు అద్దుకొన్నాను.

ఆ యువకుడు కూడా లేచి కళ్లకు అద్దుకున్నాడు. మళ్లీ కూర్చుండిపోయాడు.

ప్రసన్నభట్ నాతో మిశ్రమ భాషలో "దేవసేనగారూ, మీరు చాలా చికాకుల్లో ఉన్నట్లు గుమాస్తాగారు చెప్పారు.

**ఆంధ్రభూమి-ఆటా పోటీలో ఎంపికైన కథ**



ఇప్పుడు మీరు అష్టోత్తరం పూజ చేయించుకున్నారు. సరే, రంగపూజ కూడా చేయించుకోకూడదూ? మీ సమస్యలన్నీ మబ్బుల్లాగా విడిపోతాయి. మనసు దూది లాగా తేలికపడి ప్రశాంతమవుతుంది" అన్నాడు.

నేనన్నాను, "రంగపూజా! నేనెప్పుడూ చేయించలేదు. అయినా వచ్చే వారం నేను మా విజయవాడ వెడుతున్నాలెండి. అక్కడ మా నాన్నగారింట్లో చేయించుకుంటాను"

"రంగపూజ మీ ఆంధ్రాలో చెయ్యరమ్మా! ఈ కర్నాటకలో కూడా మళ్లీ బెంగళూరులో లేదు. ఇది ఈ మంగుళూరును, అనగా దక్షిణ కర్నాటకకు మాత్రమే పరిమితమైన ప్రాంతీయ పూజ. ఇక్కడ తపస్సు చేసిన పరశురాముడి చేత ప్రవేశపెట్టబడిన పూజ. ఇంకా, దీన్ని ఇళ్లల్లో చెయ్యరు. శైవక్షేత్రాల్లోనే చేస్తారు."

అక్కడికి దగ్గర్లోనే ఉన్న ఇన్ఫోసిస్ కంపెనీ తాలూకు ఇంజనీరు కుర్రాళ్లిద్దరొచ్చారు. వాళ్లకి ప్రసన్నభట్ తీర్థమూ, శ్రీగంధ, మారేడు దళాల ప్రసాదమూ ఇచ్చాడు. వాళ్లు తమ పర్సులు తీసి తలా ఒక ఇరవై రూపాయల నోటూ పళ్లెంలో వేసారు. వెళ్లిపోయారు.

ప్రసన్నభట్ నావైపు తిరిగి మళ్లీ అన్నాడు "రంగ పూజ అనేది విశేషమైన పూజ. దీనికొరకే నియమించబడిన కొన్ని ప్రత్యేక మంత్రాలతో ముందర స్వామిని అర్చిస్తాము. తర్వాత రుద్రమూ నమకాలతోనూ సహస్రనామాలతోనూ అర్చన చేస్తాం. అర్చనకు పూలూ, మారేడు దళాలూ, దూర్వా (గరికె) వాడతాం. ఆ తర్వాత ఇరవై ఒక్క అరటి ఆకుల్లో ప్రత్యేక పదార్థాన్ని నైవేద్యం పెడతాం. ఆ అరటి ఆకుల్ని ఒకదాని వెనక ఒకటిగా రెండు నిలువు వరసల్లో స్వామికి ఎదురుగా పెడతాం. వాటి కొసలన్నీ స్వామి వైపు చూస్తూంటాయి"

"దేన్ని నైవేద్యం పెడతారు?"

"పంచ కజ్జాయం ముద్దల్ని"

"ఈ ప్రాంతంలో అంతటా ఇచ్చే ప్రసాదం పంచకజ్జాయమే కాబట్టి దాని రుచి నాకు తెలుసు. కానీ దాన్నసలు దేంతో తయారుచేస్తారు?"

"వరి పేలాల పిండి, శనగపిండి, పటికబెల్లం, ఎండుకొబ్బరి, తేనె- వీటితో తయారుచేస్తారు. ఈ ముద్దల్ని చిన్న చిన్న దొప్పల్లో పెట్టి ఆ అరటి ఆకుల మీద పెడతాం. ఆ పక్కనే చెరుకు ముక్కల్ని కూడా పెడతాం. ఈ నైవేద్యం అయిం తర్వాత అవ్వే అరటి ఆకుల్లో తాంబూలాలు పెడతాం. అంటే, పచ్చి అడికెకాయ (వక్క), యాలక్కాయ, తెల్ల మిరియం, లవంగం, జాజికాయ, జాపత్రి, పచ్చకర్పూరం- వీటితో కూడిన తమలపాకులన్నమాట. ఆ తర్వాత నలుగురం అర్చకులం కలిసి -చెరొకపక్కగా ఇద్దరిద్దరం చొప్పున నుంచొని మహామంత్రపుష్పం పఠనం చేస్తాం. ఈ పఠనం చాలా బాగుంటుంది. మీరు సకుటుంబంగా వచ్చి చూస్తే మాకానందం. ఇంకా, ఆరోజంతా మీరు ఉపవాసం ఉండి మర్నాడు ఒక బ్రాహ్మడికి భోజనం మీ చేత్తో వండి వడ్డిస్తే ఎంతో ఎంతో మంచిది"

చటుక్కున నేనన్నాను "బ్రాహ్మలకి మేం ఎల్లా వండి వడ్డించగలం?"

"అయితే సంచారం ఇచ్చి వాళ్లు తినే ఇంట్లో వడ్డింపించండి"

ఒక పడుచమ్మాయి వచ్చింది. నమస్కారం పెట్టుకుని, పళ్లెంలో ఏమీ వెయ్యకుండానే తీర్థమూ ప్రసాదమూ తీసుకుని వెళ్లిపోయింది.

తెల్లలుంగీ యువకుడు ఏవో స్తోత్రాలు కాబోలు గొణుక్కుంటున్నాడు.

నేను భట్‌ని అడిగాను "రంగపూజను ఎప్పుడయినా చేస్తారా?"

అతనన్నాడు. "లేదు, సూర్యాస్తమయం అయ్యాకనే మొదలుపెడతాం. రెండు గంటలు పడుతుంది. మీవారి ఆఫీసుకి ఇబ్బంది కూడా ఉండదు. వచ్చే సోమవారం చేయించుకోండి. ఫలితం మీకు వెంటనే కనిపించి తీరుతుంది!"

"ఎంత ఖర్చవుతుంది?"

"అయిదు వందలు"

అయిదు వందలనగానే నా మనసు మూలిగింది. కానీ నా మనసును నా బుద్ధి జయించింది. "సరే" అన్నాను.

నేను నా పర్సు తీసాను. అడ్డమడతల్లో ఉన్న వంద కాగితాలు మూడే ఉన్నాయి. వాటిని తీసి ప్రసన్నభట్‌కు ఇస్తూ, "ఇప్పటికిది తీసుకొని వచ్చే సోమవారానికే రంగపూజ స్థిరపరచండి. నా దగ్గర ఇంక ఒక వెయ్యి నోటు మాత్రమే ఉంది. కనక మిగిలింది రేపిస్తాన్లెండి" అన్నాను. ఈ డబ్బివ్వటంలో చటుక్కున నా చేతిలోంచి పర్సు జారి కింద పడింది.

"పూజకు నేనేం తెచ్చుకోవాలి?" అని అడుగుతూ, భట్ వైపు చూస్తూ నేను వంగి నా పర్సును అందుకున్నాను.

ఆలస్యమైపోతోందని, మూషిక విగ్రహం పక్కగా, బలిపీఠం పక్కనించి ప్రవేశద్వారం వైపుగా నడిచాను.

నాతో నడుస్తూ భట్ అన్నాడు, "పూలు ఒక్కటే తెచ్చుకోండి చాలు"

"ఇంత పూజ చేయిస్తున్నాను గదా, ఏం పూలయితే శ్రేష్ఠమంటారు?"

ప్రవేశద్వారంలో ఇద్దరం ఆగాము.

అతనన్నాడు, "అడికె వూ గుచ్ఛ (పోక పువ్వుపొత్తి) శ్రేష్ఠం"

"మంగుళూరుకి చివరగా ఉర్వాలో ఉన్నదాన్ని. పోక పువ్వు పొత్తి నాకెక్కడ దొరుకుతుంది?"

ప్రసన్నభట్ ఆలోచించి అన్నాడు. "పక్కనే కంకనాడిలో పోకతోటలు విస్తారంగా ఉన్నాయి. అక్కడినించి ఏరోజు కారోజు పూలబజారుకు పొత్తులు తెచ్చేవాడొకడు నాకు తెలుసు. లేదా ఇటు ఉడిపినించి రోజూ మా తమ్ముడొస్తూంటాడు. వాడితోనయినా తెప్పిస్తాను"

"దాని కెంతవుతుంది?"

"వంద"

"ఇస్తాను. అంటే ఇప్పుడు మీకు నేను మూడొందలివ్వాలన్నమాట.... ఇప్పుడే ఇస్తాన్లెండి..మరి వెయ్యికి మీ దగ్గర చిల్లరుందా?"

"గుమాస్తానడుగుదాం రండి"- ఇల్లా అంటూ ప్రసన్నభట్ మళ్లీ బలిపీఠాన్ని చుట్టి గుమాస్తా ఉన్న గది దగ్గరికి నన్ను తీసుకొచ్చాడు. గది కౌంటర్‌లో గుమాస్తా లేడు.

సమయం ఏడున్నర దాటుతోంది. శ్రీవారు ఇంటికొచ్చే వేళయింది. నేను ఇప్పటికే చాలా ఆలస్యం చేసాను. నాలో అసహనం చోటు చేసుకోసాగింది.

ఇప్పుడు ఆ తెల్లలుంగీ యువకుడు ముఖ మంటపంలో లేడు. అతనిలో చురుకుదనం వచ్చింది. ఆదరాబాదరాగా ప్రదక్షిణాలు చెయ్యటం మొదలుపెట్టాడు.

ప్రసన్నభట్ ఎంతమంది భక్తులు రంగపూజ చేయించుకొని సమస్యల వలయాల్లోంచి బయటపడ్డారో వివరించి నాకు చెప్తున్నాడు. అంతకు పదేళ్ల కిందట శృంగేరీ పీఠాధిపతి వచ్చి ఇక్కడ యజ్ఞం చేసారట. అప్పట్నుంచీ భక్తులపట్ల ఈ గణపతిస్వామికి అనుగ్రహం పెరిగిపోయిందిట! తన దర్శనం చేసుకుని ప్రార్థిస్తే చాలు, ప్రతి వ్యక్తినీ ఎంతో కొంతగానయినా ఆయన అనుగ్రహిస్తూనే ఉన్నాడట!

పది నిముషాలు గడిచాయి. గుమాస్తా ఇంకా రాలేదు.

ఆ తెల్లలుంగీ యువకుడు ముఖ మంటపంలో స్వామికి ఎదురుగా నుంచుని చెవులు పట్టుకుని గబగబా గుంజీలు తీస్తున్నాడు. సాష్టాంగం పడుతున్నాడు. లేస్తున్నాడు. లెంప లేసుకుంటున్నాడు. లుంగీతో కళ్లు తుడుచుకుంటున్నాడు. మళ్లీ గుంజీలు తీస్తున్నాడు. మళ్లీ సాష్టాంగ పడుతున్నాడు. ఏమిటేమిటో గొణుక్కుంటున్నాడు!

అతని ప్రవర్తన చిత్రంగా అనిపించి నేనూ భట్ అతని వైపు చూసాం.

ప్రసన్నభట్ మళ్లీ అన్నాడు, "ప్రమీల అంట...మీ తెలుగావిడే..ఇక్కడ మిలాగ్రేస్ చర్చి దగ్గర ఆంధ్రాబ్యాంక్‌లో పనిచేస్తోంది. కొడియాల్ బెయిల్‌లో ఉంటోంది. పెళ్లయి పదేళ్లయినా పిల్లల్లేరట. ఈ స్వామికి రంగపూజ చేయించింది. అంతే, వెంటనే పండంటి మగబిడ్డను కన్నది. ఏ అమ్మాయి అయినా రంగపూజ చేయించిందంటే ఆర్నెల్లలో ఆమె ఇల్లాలు అవ్వవలసిందే. ఇక్కడి ఇన్ఫోసిస్‌లోని ఇంజనీరు అమ్మాయిలందరికీ అదే అనుభవం...తలకావేరిలో సూపర్‌వైజర్‌ట..ఈ ఊరివాడే-కాన్సర్! ఇక్కడ మూడుసార్లు రంగపూజ చేయించాడు. అంతే కాన్సర్ మటుమాయం! మూడుసార్లు మేం అతనికి సగం డబ్బుకే చేసాం కూడా!"

తెల్లలుంగీ యువకుడు సాష్టాంగం పడి ఉండే కిందికి పైకీ మూడుసార్లు ఊగాడు. చెవులు నేలకి ఆనించాడు.

## సంచలనం

గర్ల్‌ఫ్రెండ్ తర్వాత జనం ముందుకి వచ్చిన ఇషా తాను చెప్పే అభిప్రాయాల్ని ఖచ్చితంగా పాటిస్తానంటోంది. 'ఈ చిత్రం మహిళా ప్రేక్షకుల ఆగ్రహాన్ని పొందడం వాస్తవమే. ఉన్న మాటంటే ఉలుకెక్కువ అన్నట్టుగా సామాజికంగా వస్తున్న మార్పుల్ని సినిమాల ద్వారా చెప్పడం మామూలే కదా. అలాంటప్పుడు తమ మధ్య ఏం జరుగుతోందో జనాలకి తెలియాలి. అందుకే అలాంటి సినిమాలో నటించడానికి నేను సుముఖత వ్యక్తం చేశాను' అంటోంది ఇషా. ఆమె సినిమాల్లాగే ఆమె మాటలు కూడా సంచలనాలే.



లేచి నుంచున్నాడు. శిరస్సు మీద అంజలి ఘటించాడు. గట్టిగా, "వినాయకా, దీనరక్షకా, నినగె హత్తు సావిర నమస్కారగళు. క్షమిసు దేవరె, నన్నన్ను క్షమిసు!" (నీకు పది వేల నమస్కారాలు. క్షమించు దేవా నన్ను క్షమించు) అన్నాడు. గబగబా అడుగులేసుకుంటూ బయటకి వెళ్లిపోయాడు.

ప్రసన్నభట్‌కూ నాకూ మాటల్లో ఇంకో పది నిముషాలు గడిచాయి.

గుమాస్తా మహాశయుడు ఊడిపడ్డాడు.

అతన్తోనేనన్నాను, "నేను వెళ్లిపోవాలి. వెయ్యి నోటుకు చిల్లర ఇస్తారా?"

గుమాస్తా అన్నాడు, "వెయ్యి ఆదాయం ఎక్కడిదమ్మా, ఇక్కడికి రావలసిన భక్తులంతా ఇవ్వాళ శుక్రవారం కారణంగా మంగళాంబిక ఆలయానికి వెళ్లారు. అక్కడ ఉత్సవాలు జరుగుతున్నాయి గదా! అయినా ఇవ్వండి, చూస్తాను."

నేను నా పర్సు తీసి చూసాను. గుండె గుభేలుమంది. అడ్డమడతలు పెట్టుకుని నేను తెచ్చుకున్న వెయ్యి నోటు లేదు. ఆ బెత్తెడంత పర్సును మూసి తీసి రెండు అరల్లోనూ మళ్లీ మళ్లీ చూసాను. ఏదీ లేందే!

నేను కంగారుగా వెళ్లి మూషిక విగ్రహం పక్కన చూసాను. గర్భాలయం చుట్టూ వెతికాను. ఎర్రని కొత్తనోటు! ఎరుపు ఆకర్షిస్తుంది కనక కిందపడిన చోటనే ఉండి ఉంటే ఆ లైట్ల కాంతిలో కనిపించకపోవటమంటూ ఉండదు. నాతోపాటు భట్ కూడా అంతా వెతికాడు.

భట్ అన్నాడు, "ఇందాకన వందనోట్లు మూడు తీసి నాకిచ్చారు గదా అప్పుడే వెయ్యి నోటు ఉందా?"

"ఉందండీ, అప్పుడుంది" అన్నాను.

"అన్నట్టు ఆ తర్వాత మీ పర్సు కిందపడింది కదూ! అప్పుడిక్కడ ఎవరున్నారూ...ఆ లుంగీ కుర్రాడున్నాడు కదూ! ఆ తర్వాత ఇంక ఎవ్వరూ గుళ్లోకి రాలేదు. గుమాస్తాగారూ ఆ కుర్రాడి పేరేమిటి?"

గుమాస్తా చురుగ్గా అన్నాడు, "పాండురంగ షెనాయ్. మంగుళూరు ఓడరేవులో మాల్యా గేట్ వాచ్‌మన్. అయితేనేం, నిత్య దరిద్రుడు. పెళ్లయిన పదేళ్లకి, ఇప్పటికి వాడి పెళ్లాం కన్నదిట. పిల్లాడు బలహీనంగా ఉన్నాట్ట. వాణ్ణి బతికించుకోటానికి డబ్బు లేదట. ఈ ఉదయమే మా ఇంటికొచ్చి అప్పు అడిగాడు. 'ఎలా తీర్చగలవు, పొమ్మ'న్నాను. అవునూ, ఇందాకన మీరిద్దరూ మాట్లాడుకుంటూ బలిపీఠం పక్కగా వెడుతున్నప్పుడు వాడు కిందికి వంగి ఏదో తీసినట్లున్నాడే!"

భట్ నాతో అన్నాడు, "మీ పర్సు కిందపడినప్పుడు ఆ వెయ్యి నోటు అందులోంచి జారిపడి ఉంటుంది. దాన్ని వాడు తీసుంటాడు"

నేను, "అవును తప్పకుండా అదే అయ్యి ఉండాలి" అన్నాను.

గుమాస్తా మళ్లీ చురుగ్గా అన్నాడు, "అయితే ఆ వెధవని పిలిపించనా! దొంగతనం ఒకటా వీడి మొహానికి! ఆగండి చెబుతాను"- ఇట్లా అంటూ గుమాస్తా బయటకొచ్చి, ఆలయం కాపలా వాడికోసం చుట్టూ చూసాడు.

ప్రసన్నభట్, "అమ్మా, ఎనిమిదవుతోంది, నాకు హారతికి వేళయింది. నేను లోపలికెళతాను" అంటూ గర్భగుళ్లోకి వెళ్లిపోయాడు.

పాండురంగ షెనాయ్ ప్రవర్తన అంతా నా కళ్ల ముందు రీలు తిరిగింది. నాకు ఆలోచన్లు సుళ్లు తిరిగాయి. చాలాసేపు కన్నీరు కారుస్తూ నిశ్చలంగా కూర్చునున్నవాడికి హఠాత్తుగా చురుకుదనం ఎట్లా వచ్చింది?- నా వెయ్యి నోటు దొరకబట్టే కదూ! ఆ నోటువల్ల తన కొడుకు జీవిస్తాడన్న ఆశ కలగబట్టే కదూ! తనది కాని ఆ నోటును తీసుకోవటంలో తను తప్పు చేస్తున్నాననిపించినందుకే గదూ, చివరికి 'క్షమిసు దేవరే' అని వేడుకొన్నది!

'ఆ వెయ్యి నోటు నా దగ్గరుండటం వల్ల నా సమస్యలేవీ తీరవు. కానీ అదే వెయ్యి నోటు పాండురంగ షెనాయ్‌కి లేకలేక కలిగిన కొడుకుని బతికిస్తోంది. కానీ మరి.. మరి ఆ వెయ్యితో నేను రంగణ్ణి పూజించటంలో కలుగుతున్న విఘాతం మాటేమిటి? సర్లేవోయ్, అసలు రంగడెక్కడున్నాడంటావ్?'

సరిగ్గా సమయానికి ప్రసన్నభట్ గర్భగుడిలోంచి పురుషసూక్తం చదువుతున్నాడు 'సహస్రశీర్షా పురుషః, సహస్రాక్షః సహస్రపాత్..'

'అదుగో రంగడికి, అంటే ఆ పరమేశ్వరుడికి వెయ్యి తలలట, వెయ్యి కళ్లట, వెయ్యి పాదాలట! అంటే ప్రజలే కదా! ఆ ప్రజల్లో ఈ షెనాయ్ ఒకడు కదా! అంటే, అంటే, నేను ఈ పాండురంగ షెనాయ్‌ని సేవిస్తే ఆ పరమేశ్వరుణ్ణి పూజించినట్టే గదా!' హఠాత్తుగా నా మనసులోంచి కొండంత బరువు తొలిగిపోయినట్లయింది!

నేను గుమాస్తాతో గట్టిగా, "ప్లీజ్, పాండురంగ షెనాయ్‌ని పిలిపించకండి. నేను ఆ నోటును బయటే ఎక్కడో పారేసుకుని ఉంటాను" అన్నాను.

ప్రవేశద్వారం వైపు నడిచాను. లోపలి వైపున ఉన్న అరుగుమీద కూర్చుని స్వామిని చూస్తున్నాను. తన నిలువెత్తు వెండి తొడుగులో స్వామి, నక్షత్ర హారతి కాంతుల్లో దగద్ధగాయమానంగా మెరిసిపోతున్నాడు. అదుగో తొండం ఎత్తి పకపకా నవ్వుతున్నాడు! నాతో, "నీ వెయ్యి నోటుతో నా పూజను నువ్విప్పుడు చెయ్యనే చేసావుగా!" అంటున్నాడు. అశ్రువులు ఊరుతూన్న నా కంటియొక్క కనీనికాపటలంపై వెయ్యి రూపాల్లో నర్తిస్తున్నాడు.

ప్రసన్నభట్, హారతి నా దగ్గరకు తీసుకొచ్చాడు.

నేనడిగాను, "ఇంతకీ రంగపూజ అన్నారేంటి, గణపతి పూజ అనొచ్చు గదా!"

భట్ అన్నాడు, "ఇందాకన నేను చెప్పిన అరిటాకులన్నింటినీ ఒక రంగం మీద, అంటే ఒకే బల్లమీద, అమర్చి అర్చన చెయ్యటం కనక, రంగపూజ అన్నారు"

నేను గట్టిగా అరవబోయాను, 'కాదు, కాదు. రంగపూజ అంటే రంగణ్ణి సేవించటం- అదే, పాండురంగ షెనాయ్‌ని సేవించటం!' చటుక్కున లేచి వడివడిగా బయటకొచ్చేసాను. నా మనసు దూదెపింజ అయిపోయి తృప్తితో మేఘాల్లో తేలి తేలిపోతోంది!

రంగపూజ అయింది కదా, ఫలితం కనబడదా మరి!

✤

## మళ్లీ మెరుపులు

**ఎక్స్‌ట్రా హీరోయిన్ రుతిక తెలుగు ప్రేక్షకుల్ని అలరించడానికి ఎంతో శ్రమిస్తోంది. కొత్త చిత్రం 'త్రిల్' కోసం ఆమె అందాలు ఆరబోయడానికి కూడా వెనుకాడలేదు. 'ఈ చిత్రంతో ఆమె మరింత ఫేమ్‌లోకి వస్తుంది. మంచి టాలెంట్ ఉన్న నటి రుతిక' అని ఇండస్ట్రీ జనాలు వ్యాఖ్యానిస్తున్నారు. టాలెంట్‌క తగ్గట్టు అవకాశాల్ని తనకు అనుకూలంగా మార్చుకోగల సత్తా కూడా ఆమె సంపాదించుకుంటోంది.**

